
ప్రజాశక్తి
శనివారం 14 అక్టోబర్ 2023
5
పార్వతీపురం మన్యం



జ్వరంతో గ్రామ వాలంటీర్ మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం


కృష్ణవేణి

మండలంలోని కిమ్మికి చెందిన గురాన కృష్ణవేణి (28) విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. గ్రామస్తులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. రెండు నెలల కిందట కృష్ణవేణికి జ్వరం రాగా మందులు వేసు కోవడంతో జ్వరం తగ్గుతూ వస్తుంది. ఈనెల 7న గ్రామంలో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య తనిఖీలు చేసుకోగా, వేరే చోటికి వైద్య తనిఖీలు చేసుకోవాలని వైద్యులు, సలహాలు ఇచ్చారని రెండు రోజుల తర్వాత విజయనగరం జిల్లా రాజాం ప్రైవేటు ఆసుపత్రికి పరీక్షలు చేయగా, అక్కడి నుంచి శ్రీకాకుళం వెళ్లాలని వైద్యులు సలహా ఇచ్చారు. అక్కడి నుంచి విశాఖకు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమెకు భర్త , కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఎండుతున్న వరి

ఉమ్మడి జిల్లాల్లోనూ వర్షపులోటు ● ఆందోళనలో అన్నదాత

ఇటు విజయనగరం, అటు పార్వతీపురం మన్యం జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. దీంతో, ఇరు జిల్లాల్లోనూ అత్యంత ప్రధానమైన వరి పంట ఎండిపోతోంది. నీరు లేక పలు గ్రామాల్లో దుర్భిక్ష పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళనకు గురౌతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వరిపై ఆశలు వదులుకోవాల్సిందేనంటూ ఆవేదన చెందుతున్నారు.


వీరఘట్టం మండలం నడుకూరులో ఎండిపోతున్న వరి పంట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ ఖరీఫ్‌లో వరి లక్షా 66వేల 886 ఎకరాల్లోనూ, 12,500 ఎకరాల్లో మొక్కజొన్న, 14,480 ఎకరాల్లో పత్తి పంట సాగవుతోంది. జిల్లాలో తోటపల్లి, వెంగళరాయసాగర్, పెద్దగెడ్డ ప్రాజెక్టులున్నప్పటికీ నిర్వహణ సరిగా లేకపోవడం, పిల్లకాలువల పనులు పూర్తిచేయక పోవడం వంటి కారణాల వల్ల అరకొర గానీ నీరు అందుతోంది. అలాగే జంఝావతి, వట్టిగెడ్డ ప్రాజెక్టులున్నా ఇటువంటి ఆటంకాలే ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో వరుణుడు కూడా ముఖం చాటేయడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయి. జూన్‌లో 51.9 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు ఉండడంతో నారు వేయడం ఆలస్యమైంది. జులైలో వర్షాలు సహకరించడంతో నారుపోతలు పూర్తయినప్పటికీ ఆగస్టులో తిరిగి లోటు వర్షపాతం నమోదు కావడంతో సెప్టెంబర్ నెలాఖరు వరకూ పడిన వర్షపునీటితోనే రైతులు ఉబాలు పట్టారు. ఉబాలు అయ్యాయంటూ ఊపిరి పీల్చుకునే లోపు తిరిగి అక్టోబర్ 1వ తేదీ నుంచి పూర్తిగా వర్షాలు కురవలేదు. గడిచిన 13రోజుల వ్యవధిలో 63.2 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం నమోదైంది. మొత్తం 15 మండలాలకు గాను వీరఘట్టం, జిఎల్‌పురం, కురుపాం, కొమరాడ మండల్లాల్లో వర్షపులోటు ఉంది. సీజన్ మొత్తంగా పరిశీలిస్తే ఈ జిల్లాలోనూ జూన్, ఆగస్టులో వర్షం తక్కువగానే పడింది. ప్రస్తుతం కొమరాడ, పార్వతీపురం, మక్కువ తదితర మండలాల్లో పంట పొలాలు బీటలు వారుతున్నాయి. మరోవైపు ఇటీవల ఎండ తీవ్రత కూడా ఎక్కువగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరా వరికి రూ.30వేల నుంచి రూ.40వేల వరకు పెట్టుబడులు పెట్టేశామని, ప్రస్తుతం వర్షాలు పడకపోతే మన్నైపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్కువ వర్షం కురవడంతో చెరువులు పెద్దగా నిండలేదు. మిగిలిన రోజుల్లో తీవ్రమైన ఎండలు కాయడంతో చెరువుల్లో నీరు కూడా పూర్తిస్థాయిలో లేని పరిస్థితి దాపురించింది. ఈనేపథ్యంలో అత్యంత కీలకమైన పొట్టదశలోను, గింజకట్టే దశలోనూ ఉన్న వరి ఎండిపోతోంది.


ఇంజన్‌తో నీరు పెడుతున్న రైతు

ప్రతి తడికీ రూ.500



చెప్పుకోవడానికి తోటపల్లి కాలువ ఉందని తప్ప కనీసం చుక్క నీరు రాకపోవడంతో వరుణిపైనా, మోటారుపైనా ఆధారపడి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎకరాన్నర భూమి ఉంది. దీనికి సుమారు రూ.20వేలు ఖర్చు అయ్యింది. కాలువ ద్వారా నీరు వస్తే పంటల సాగు చేస్తే ఎకరాకు 35 బస్తాలు దిగుబడి వస్తుంది. గంటకు రూ.500 చొప్పున మోటర్ ద్వారా పంటలు సాగు చేస్తున్నాం. దిగుబడి తగ్గితే అప్పులు తప్పవు.

రఘుమండ తాతబాబు,
రైతు, గడగమ్మ , వీరఘట్టం మండలం

అప్పలే మిగులుతున్నాయి



ప్రతి ఏటా వరుణుడిపై ఆశలు పెట్టుకుని పంటలు సాగు చేస్తున్నప్పటికీ గత పది రోజులుగా ఎండ వేడిమి వల్ల పంట నాశనమవుతుంది. వర్షాలు కురవక పంట పూర్తిగా ఎండిపోయిన స్థితికి చేరుకుంది. ప్రస్తుతం పంట పొట్టదశలో ఉన్నందున అధికంగా నీరు అవసరం ఉంది. కాలువ నీరు రాక, వరుణుడు కరుణ చూపక పండిన పంట అప్పులకే పోతుంది. ప్రతి ఏటా నాలుగు ఎకరాలు సాగు చేస్తున్నాను. ఈ ఏడాది కూడా సాగునీటి సమస్య ఏర్పడింది.

వి.పోలినాయుడు,
రైతు, గడగమ్మ, వీరఘట్టం మండలం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు సుబ్బరావమ్మ, నాయకులు

21 నుంచి ప్రజారక్షణ భేరి

- సీతంపేటలో బస్సుయాత్ర ప్రారంభం
- సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ

ప్రజాశక్తి- బెలగాం

రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యాన ప్రజా రక్షణ భేరి పేరిట ఈనెల 21నుంచి బస్సుయాత్రను ప్రారంభిస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ తెలిపారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుంచి బస్సుయాత్రలు ప్రారంభం కానుండగా, జిల్లాలోని సీతంపేటలో బస్సుయాత్రను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రారంభిస్తారని తెలిపారు. శుక్రవారం సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ బస్సుయాత్ర గిరిజన ప్రాంతాన్ని కలుపుతూ అరుకు, పాడేరు, రంపచోడవరం, పశ్చిమగోదావరి జిల్లాల మీదుగా విజయవాడ చేరుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వలన ప్రజలు, గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ నష్ట నివారణ చర్యలు జరగాలంటే రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి కోసం సిపిఎం విద్యావంతులు, మేధావులు, అన్ని రంగాల ప్రజలతో సదస్సులు నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రంలో అసమాన అభివృద్ధి జరుగుతుందని, వ్యాపారులు, రియల్ ఎస్టేట్ దారులు, పెట్టుబడిదారులు అభివృద్ధి అవుతున్నారు తప్ప ప్రజల్లో ఏ రకమైన అభివృద్ధి లేదన్నారు. ఈ విషయాలన్నీ ప్రజలకు వివరించి, రాష్ట్రానికి బిజెపి చేసిన ద్రోహాన్ని తెలియజేస్తామని తెలిపారు. రాష్ట్రానికి పత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలను నిధులు ఇవ్వకుండా రైల్వే జోన్ పట్టించుకోకుండా బిజెపి మోసం చేసిందన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించాలని రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి మద్దతు పలుకుతున్న వైసిపి, టిడిపి, జనసేన విధానాల్ని ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఈ బస్సు యాత్రలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సిపిఎం పోరాడుతోందన్నారు. జిల్లాలో ఏనుగులను అడవికి తరలించి ప్రజలకు రక్షణ కల్పించాలని, పూర్ణపాడు లాగేసి వంతెన పూర్తి చేయాలని, వైద్య శిబిరాలు కాదు సరిపడినంత మంది వైద్యులను నియమించాలని, జిల్లాలో మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మూత పడిన లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీ, సాలూరు జీగిరాం జ్యూట్ మిల్లు తెరిపించాలని, గిరిజన ప్రాంతంలో మినీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు కొల్లిగంగునాయుడు, వై. మన్మధరావు పాల్గొన్నారు.


డిప్యూటీ సిఎం రాజన్నదొరతో చర్చిస్తున్న జీగిరాం జ్యూట్‌మిల్లు ప్రతినిధి

డిప్యూటీ సిఎంతో జ్యూట్‌మిల్లు యజమాని భేటీ

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సిఎం రాజన్నదొరతో జీగిరాం జ్యూట్ మిల్లు యాజమాన్య ప్రతినిధి సప్తగిరి శుక్రవారం సమావేశమయ్యారు. గురువారం అమరావతి నుంచి వచ్చిన డిప్యూటీ సిఎం రాజన్నదొరను విశాఖపట్నం గెస్ట్‌హౌస్‌లో సప్తగిరి కలిశారు. అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు కూడా చర్చల్లో పాల్గొన్నారు. 16నెలలుగా మూతపడి వున్న జ్యూట్ మిల్లు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజన్నదొర రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్,మంత్రి జయరాంకు లేఖలు రాశారు. ఈ నేపథ్యంలో మిల్లు యాజమాన్య ప్రతినిధి రాజన్నదొరను కలిసి పరిస్థితిని వివరించారు. కార్మికులకు కొంత వరకు బకాయిలు చెల్లించామని, మిగిలిన బకాయిలు త్వరలో చెల్లిస్తామని యాజమాన్య ప్రతినిధి రాజన్నదొరతో చెప్పినట్లు తెలుస్తోంది. కార్మికులు ఎలాంటి అపోహలు చెందొద్దని, కొంతమంది శక్తులు కార్మికులను తప్పుతోవ పట్టిస్తున్నారని ఆయన రాజన్నదొరతో చెప్పినట్లు సమాచారం.

ఏజెన్సీలో ఎస్‌టి కమిషన్ చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి - కురుపాం/గుమ్మలక్ష్మీపురం

కురుపాం మండలం పొలంగూడలో పంచకామర్లతో ఇటీవల మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు పరామర్శించారు. చిన్నారుల కుటుంబానికి ధైర్యం చెప్పారు. చిన్నారుల మృతి పట్ల సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు. అనంతరం అదే గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. వైద్య శిబిరంలో స్వయంగా వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గుమ్మలక్ష్మీపురంలోని భద్రగిరి 50 పడకల ఆసుపత్రిని సందర్శించిన చైర్మన్ రోగులతో మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలో గల ఎస్‌ఎన్‌సియును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంత సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో ప్రజలకు అందుబాటులో స్పెషలిస్ట్ వైద్యుల చికిత్స లభిస్తుందన్నారు. బిపి, మధుమేహం వంటి వ్యాధులు వస్తున్నాయని, వీటిని ముందుగా గుర్తించడం ద్వారా అవసరమగు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవచ్చని చెప్పారు. ప్రభుత్వం వైద్యం, విద్యపై దృష్టి సారించడం సంతోషదాయకమన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయని, ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తుందని చెప్పారు. ఏనుగుల సమస్యపైన, తాగునీరు, రహదారులు వంటి మౌళిక సదుపాయాలు పట్ల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి కె.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై చైర్మన్‌కు వినతి

మన్యంలో పర్యటనకు వచ్చిన ఎస్టీ కమిషన్ చైర్మన్ కురుపాం మండలం పి.లేవిడి వద్ద టిడిపి అరకు పార్లమెంట్ ప్రతినిధి ఎన్.కృష్ణబాబు, గిరిజన సంఘం నాయకులు పి.లక్ష్మయ్య, ఆర్.లోవరాజు గిరిజనుల సమస్యలపై వినతి పత్రం అందించారు. బోయ వాల్మీకి బెంతు, ఒరియాలను గిరిజన జాబితాలో చేరుస్తూ రాష్ట్రమంత్రి వర్గం తీసుకున్న నిర్ణయం నిలిపివేయాలని, గిరి శిఖరాలకు రవాణా సౌకర్యం కల్పించాలని, జీవో 3ను పునరుద్ధరించాలని, గిరిజన సంస్కృతి, సాంప్రదాయాల రక్షణకు గుమ్మలక్ష్మీపురంలో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గంలో ఏనుగులు గత ఐదేళ్లుగా పంటలు నాశనం చేయడమే కాక 10మంది ప్రాణాలు పోయావని, కావున వాటిని దూర ప్రాంతాలకు తరలించాలని వినతిని అందజేశారు. గుమ్మలక్ష్మీపురం మండలం దుమ్మంగిలో గిరిజన సంక్షేమ పాఠశాలను మంజూరు చేయాలని, గతంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఎఎన్‌ఎంలు ఉండేవారని వారిని తీసివేశారని, తిరిగి వారిని నియమించి గిరిజన విద్యార్థుల ఆరోగ్యం కాపాడాలని వినతిని అందజేశారు. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రానికి ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం మంజూరైనా ఇంకా శిక్షణా కేంద్రం ప్రారంభం కాలేదని, వెంటనే దాన్ని ప్రారంభించాలని వినతి అందజేశారు. పై సమస్యలన్నింటికీ ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తారని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

గర్భిణుల వసతిగృహం పరిశీలన

అనంతరం గుమ్మలక్ష్మీపురంలో గల గిరిజన గర్భిణుల వసతి గృహాన్ని చైర్మన్ పరిశీలించారు. గర్భిణులకు పౌష్టికాహారం, వైద్య సేవలు అందుతున్నదీ, లేనిదీ పరిశీలించారు. ఈ కేంద్రానికి జనరేటర్ ఏర్పాటు చేయాలని గర్భిణులు విజ్ఞప్తి చేశారు. అనంతరం భద్రగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులతో సమావేశమై రోగులకు సేవలు అందుతున్నదీ లేనిదీ నూతన భవన నిర్మాణం చిన్నపిల్లల కేంద్రం పనితీరు తదితర అంశాలను చర్చించారు. అనంతరం రోగులతో మాట్లాడే వైద్య సేవలపై ఆరా తీశారు. చివరగా గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మీ పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం మంచి పాఠశాలలను ఏర్పాటు చేసిందని, వీటిని సద్వినియోగం చేసుకొని మీ పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పలు గిరిజనుల సంఘాల నుంచి వినతి పత్రాలు తీసుకున్నారు. ఆయన వెంట ఎటిడబ్ల్యూఒలు చంద్రమోహన్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌లో యుగంధర్, పెంటయ్య, ఎలిమెంట్పేట సిఐ సత్యనారాయణ, ఎస్‌ఐ షణ్ముఖరావు, ఉద్యోగులు, గిరిజన సంఘాల ప్రతినిధులు ఉన్నారు.


గర్భిణులతో మాట్లాడుతున్న ఎస్‌టి కమిషన్ రాష్ట్ర చైర్మన్ శంకరరావు


కలెక్టరేట్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, కన్సల్టెంట్ ప్రతినిధి ఆషిద్

అడ్డాపుశిలలో కలెక్టర్ కార్యాలయం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

నూతన సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కలెక్టర్ నిశాంత్ కుమార్ శుక్రవారం అడ్డాపుశిలలో పరిశీలించారు. పట్టణ శివార్లలోని అడ్డాపుశిల వద్ద 59.80 ఎకరాల్లో కలెక్టరేట్ నిర్మాణానికి స్థలం ప్రతిపాదించారు. శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన కన్సల్టెంట్ గ్రూప్ ఆకార్ ప్రతినిధి ఆషిద్‌తో కలిసికలెక్టర్ స్థలాన్ని సందర్శించారు. కన్సల్టెంట్ స్థలాన్ని సందర్శించిన తర్వాత స్థలం నిర్మాణానికి అనుకూలంగా ఉందని అభిప్రాయపడ్డారు. గతంలో కలెక్టర్, ఇతర అధికారులు పలుమార్లు సందర్శించి స్థలాన్ని ఖరారు చేశారు. జిల్లా ఏర్పాటుకు ముందు గత జిల్లా యంత్రాంగం కూడా భవన నిర్మాణానికి స్థలాన్ని ప్రతిపాదించింది. అడ్డాపుశిలలో కొత్త ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ రాబోతోంది. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పరిపాలనకు సరిపోయే, ప్రజల సౌకర్యార్థం ఒక అందమైన భవనాన్ని తీసుకురావడానికి ప్రతి అంశాన్ని పరిశీలించాలని కన్సల్టెంట్‌కు సూచించారు. అడ్డాపుశిల అనువైన ప్రదేశమని, భవిష్యత్తులో మరిన్ని అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం వద్ద భూమి అందుబాటులో ఉందని అన్నారు. అత్యుత్తమ సమీకృత కలెక్టరేట్లలో ఇదొకటి కాగలదని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఇన్‌ఛార్జ్ ఇఇ ఎస్.వేణుగోపాల్, డిఇ ఎ.అప్పాజీ, టిడ్కో ఇంజినీర్లు, తహశీల్దార్ పాల్గొన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు ముగ్గురు పిఇటిలు ఎంపిక

విజయనగరం : ఈనెల16 నుండి 19వరకు న్యూఢిల్లీ లో జరిగే జాతీయ స్థాయి ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఖోఖో పోటీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టులో జిల్లాకు చెందిన ముగ్గురు వ్యాయామ ఉపాధ్యాయినులకు అవకాశం లభించింది. ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలో మొదటి సరిగా ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నారు. వ్యాయమ ఉపద్యారాలుగా పనిచేస్తూ క్రీడాకారులను తయారుచేస్తున్న కోనూరు హైస్కూలు పిఇటి ఎస్.విజయలక్ష్మి, పెద్దతాడివాడ హైస్కూలు వ్యాయమ ఉపాధ్యాయురాలు సిహెచ్. ఆదిలక్ష్మి, మెట్టపల్లి హైస్కూలు పిఇటి ఎస్.కనక మహాలక్ష్మి రాష్ట్రజట్టుకు ఎంపికయ్యారు.

చంద్రబాబుకు మెరుగైన వైద్యమందించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడును అరెస్టు చేసి 34 రోజులైందని, ఎటువంటి ఆధారాల్లేకుండా అక్రమంగా స్కిల్ డెవలప్మెంట్ కేసులో అరెస్టు చేయడం అన్యాయమని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఆరోగ్యం సరిగాలేనందున తక్షణమే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించాలని ఆమె డిమాండ్ చేశారు. ఆయన ఆరోగ్యం పట్ల ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తమ అధినాయకుడికి ప్రాణానికి ఏం జరిగినా ప్రభుత్వానిదే పూర్తి బాధ్యతని ఆమె తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఎటువంటి తప్పు చేయకపోయినా రాజకీయ కక్షలతో వైసిపి ప్రభుత్వం అరెస్టు చేసిందన్నారు. త్వరలోనే చంద్రబాబు నాయుడు నిర్దోషిగా బయటకు వస్తారని ఆమె తెలిపారు. 33 రోజులుగా అరెస్టు చేసి ఎటువంటి ఆధారాలు కోర్టుకు సమర్పించకుండా కక్ష సాధింపులు చేయడం ప్రజలు గమనిస్తూ ఉన్నారన్నారు. గతంలో ఫైబర్ గ్రిడ్ చాలా తక్కువ ధరకే ప్రజలకు అందుబాటుకి ఇచ్చే వారిని ప్రస్తుతం అధిక ధరలు పెంచి ఎప్పటికప్పుడు సాంకేతిక లోపాలు జరుగుతూ ఉన్నాయని ఆమె తెలిపారు. విలేకరుల సమావేశంలో మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శనరావు, మహిళా కార్యదర్శి హారిక జానకి, టిడిపి నాయకులు పోలూరు శ్రీను, నరేష్, దామోదర్, టిడిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీతంపేట : అక్రమ అరెస్ట్ తో రాజమండ్రి జైల్లో ఉన్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందని వస్తున్న వార్తల నేపథ్యంలో మెరుగైన వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని టిడిపి నాయకులు పడాల భూదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చంద్రబాబుపై కక్ష పూరిత చర్యల్లో భాగంగానే సరైన వైద్యం అందించకుండా నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోందన్నారు. అధినేతకు సంబంధించిన హెల్త్ బులెటెన్స్ ఎప్పటికప్పుడు వైద్యుల ద్వారా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇప్పటికే పార్టీ శ్రేణులు ఆందోళనలో ఉన్నారని సరైన సమాచారాన్ని అందివ్వాలని డిమాండ్ చేశారు.

గోదాముల పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిఆర్‌ఎస్ గోదాముల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని గిరిజన సహకార సంస్థ అసిస్టెంట్ రిజిస్టర్ ఇందిరా లావణ్య తెలిపారు. శుక్రవారం ఆమె మండలంలోని పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న డిఆర్‌ఎస్ నిత్యవసర సరుకుల గోదాముల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ గోదాముల నుంచి వస్తున్న బియ్యం, పంచదార, పప్పు, తదితర నిత్యవసర సరుకులను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేసి సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆమె ఐటిసి ఇండేన్ గ్యాస్ గోదామును, పెట్రోల్ బంకును, ఎంఎల్‌ఎస్ గోదాములను తనిఖీ చేశారు. ఆమె వెంట జిసిసి బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాద్, అకౌంటెంట్ గణపతి, గోదాం ఇన్చార్జి సాంబశివరావు, గ్యాస్ గోదాం ఇన్చార్జ్ నాయుడు, తదితరులు ఉన్నారు.



సీతానగరం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

వేతనాలు చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్ల ఆందోళన

ప్రజాశక్తి - సీతానగరం

గ్రీన్ అంబాసిడర్లకు బకాయి పడ్డ జీతాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా నాయకులు జి.వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 నెలలుగా వేతనాల లేక గ్రీన్ అంబాసిడర్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపున పండగల కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇచ్చిందే తక్కువ వేతనమని, అది కూడా ఏడాది నుంచి చెల్లించకపోతే ఎలా అని ప్రశ్నించారు. వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, కనీసం అప్పు కూడా పుట్టక నానా అవస్థలుపడుతున్నారని అన్నారు. దీంతో ఆకలి మంటలతో కుటుంబాలను వెల్లదీస్తున్నారని, అయినా పాలకులు, అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఇటీవల మండలంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి అందజేస్తే సమస్య పరిష్కరిస్తానని చెప్పి నెల రోజులు కావస్తున్నా నేటికీ పరిష్కారం కాలేదన్నారు. జిల్లా ఉన్నతాధికారుల హామీ అమలుకాకపోతే ఇక తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలని గ్రీన్ అంబాసిడర్లు వాపోయారు. ఇప్పటికైనా తమ సమస్యను మానవతా దృష్టితో ఆలోచించి పెండింగ్ వేతనాలు చెల్లించేలా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం ఎంపిడిఒ బి.కృష్ణమహేష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల యూనియన్ నాయకులు గౌరి, సిమ్నాయుడు, సత్యనారాయణ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మ లక్ష్మీపురం : మండలంలోని గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపిడిఒ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఏడాదిగా తమకు వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ కష్టంగా ఉందని తెలిపారు. దసరా పండగ ముందు వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటి మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు, సన్యాసిరావు, పాండురంగారావు ఉన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని గోపాలపురంలో రూ.25 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, మండలి విప్ పాలవలస విక్రాంత్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తుల వద్దకు సుపరిపాలన అందజేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సేవల కోసం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంత గ్రామంలోనే సమస్యలను పరిష్కరించుకొని, సేవలు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మాళి భాను, వైస్ ఎంపిపిలు కణపాక సూర్య ప్రకాశరావు, వాకముడి అనిల్, రణస్థల రాంబాబు, వారాడ దుర్గారావు, వారాడ చంద్రశేఖరరావు, సవిరిగాన చిన్నికృష్ణ, సవిరిగాన పెద్దకృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో ఉన్న గులాబీ తోట

పి.ఆమిటి గురుకులం.. గులాబీవనం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని పి.ఆమిటి ఆశ్రమ పాఠశాలకు వెళ్లారంటే అక్కడ గులాబీ వనం సువాసనతో స్వాగతం పలుకుతుంది. ఈ పాఠశాల పరిసర ప్రాంతమంతటా గులాబీ మొక్కలే దర్శనమిస్తాయి. అక్కడ విధులు నిర్వహిస్తున్న వార్డెన్ కేంద్రుక గౌరీశ్వరి పాఠశాల లోపల, పరిసర ప్రాంతమంతా వివిధ రకాలైన మొక్కలను పెంచుతూ, కూరగాయలు సాగు చేస్తూ పచ్చదనంతో పెంపొందిస్తున్నారు. గులాబీ మొక్కలు, వివిధ రకాలైన కూరగాయల సాగు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇక్కడ పండిస్తున్న పంటలు విద్యార్థుల భోజనానికి వినియోగిస్తున్నట్లు వార్డెన్ గౌరీశ్వరి తెలిపారు. పాఠశాల ఆవరణ అంతా కూరగాయల తోటలతో, పూల మొక్కలతో కళకళలాడుతుంది.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఇఒలు

పెద్దూరు పాఠశాల పనితీరు భేష్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పనితీరు బాగుందని ఎంఇఒలు ఎం.ఆనందరావు, డి.పూర్ణచంద్రరావు కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నోట్, టెస్ట్ పుస్తకాలను పరిశీలించారు. మూడో తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేయగా, వారు చకచకా సమాధానం ఇవ్వడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు లెక్కలు అవలీలగా చేయడం, ఇంగ్లీషు రాయడంతో ఉపాధ్యాయుల పనితీరు బాగుందని కొనియాడారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడు మాట్లాడుతూ దసరా సెలవులకు విద్యార్థులు ఇంటి వద్ద చదువుకోవాలని కోరారు. ఇందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బొమ్మలు గీస్తూ పాఠాలు బోధిస్తున్న హెచ్ఎం నిర్మల్‌కుమార్

బొమ్మలు గీస్తూ... పాఠాలు బోధిస్తూ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి కనబరిచేలా ఉపాధ్యాయులు వివిధ కోణాల్లో విద్యా బోధన చేపడుతున్నారు. అందులో భాగంగా ఎల్విన్ పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న పెద్దింటి నిర్మల్‌కుమార్ జాతీయ నాయకుల చిత్రాలను గీసి వారి జీవిత విశేషాలు, దేశానికి చేసిన సేవలు వివరిస్తూ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. అలాగే జాతీయ గీతాలు విద్యార్థుల చేత పాడించి వారిలో దేశభక్తిని పొందిస్తున్నారు. క్విజ్ పోటీలు నిర్వహించి వారిలో పోటీతత్వాన్ని పెంచుతున్నారు. దీంతో విద్యార్థులు పాఠశాల పట్ల ఆసక్తి కనబరుస్తూ డ్రాప్స్ సంఖ్య తగ్గడానికి వీలుంటుందని అన్నారు.

ఉపాధి పనుల గుర్తింపు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామపంచాయతీలవారీగా ఉపాధిహామీ చట్టం పనులను గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎపిఒ మండల గౌరీనాథ్ అన్నారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామపంచాయతీల వారీగా ఉపాధి హామీ చట్టం సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులు ఉపాధిహామీ పథకం పనులను గుర్తించిన అనంతరం గ్రామసభ ఆమోదంతో పనుల మంజూరు నిమిత్తం కలెక్టర్, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌కు ప్రతిపాదనలను పంపించనున్నామని పేర్కొన్నారు. పండ్ల తోటల పెంపకంతో పాటు, మట్టిరహదారులు అభివృద్ధి, సాగునీటి చెరువుల అభివృద్ధి పనులు, భూ అభివృద్ధి పనులు, పంట పొలాలకు సాగునీరు సరఫరా అవుతున్న ఫీడర్ ఛానల్ పనులను గుర్తించామన్నారు. పంచాయతీల వారీగా త్వరలోనే గ్రామసభలను నిర్వహించనున్నామని ఎపిఒ వెల్లడించారు. గ్రామానికి, ప్రజలకు అవసరమైన పనులను గుర్తించనున్నామని పేర్కొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రభుత్వపాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు భోజనం పెట్టాలని ఎంఇఒ నగిరెడ్డి నాగభూషణరావు అన్నారు. మండల విద్యాశాఖ పరిధిలోని కొంకడివరం, శివరాంపురంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పనితీరును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించడంతో పాటు వర్క్ బుక్కులను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనం పథకం అమలును పరిశీలించడంతో పాటు వంటలను రుచి చూశారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మెనూ అమలు చేయాల్సిందేనని పేర్కొన్నారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు పక్కి రవీంద్రనాథ్, చందక గాయిత్రీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు పోటెత్తిన వినతులు

దీర్ఘకాలిక సమస్యలు వివరించిన ఎమ్మెల్యే కళావతి

ప్రజాశక్తి - వీరఘట్టం

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. 173 మంది ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తూ కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు అర్జీలను అందజేశారు. మండల స్థాయిలో ప్రత్యేకంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఆర్‌డిఒ కె.హేమలతతో కలిసి అర్జీదారుల నుంచి కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జెకెసి వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జెకెసి ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని, దీనిపై అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి నాణ్యమైన పరిష్కారం చూపాలని అన్నారు. అధికారులు ఇకపై మండల స్థాయిలో పర్యవేక్షణ చేసి తగిన సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని తెలిపారు. జెకెసి ముగిసిన పిదప మండలస్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కార దిశగా కృషి చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. అర్జీదారులు తమ సొంత, వీధుల్లోని, గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కలెక్టరుకు తమ సమస్యలను వివరించారు. వీటిలో ముఖ్యమైన కొన్ని సమస్యలు...

వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనులు వేగవంతంగా చేపట్టాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు మంజూరుచేయాలని, ముచ్చర్ల వీధిలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని, రక్షిత మంచినీరు సక్రమంగా రావడం లేదని, సొంతిల్లులేని వారికి ప్రభుత్వ స్థలాలు ఇప్పించాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే దళితవాడపురంలో రహదారులు నిర్మించాలని, స్మశానవాటికను అభివృద్ధి చేయాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. వీరఘట్టంలోని ఒట్టిగెడ్డ, రెల్లివీధి సమీపాన ఉన్న శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని, రోడ్డు నిర్మించాలని, వీరఘట్టం కళింగ వైశ్య సంఘం సభ్యులకు కమ్యూనిటీ భవనం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని, వీరఘట్టంకు మంజూరైన ఐటిఐ కాలేజీ నిర్మాణాన్ని వేగవంతంగా చేపట్టేందుకు కషి చేయాలని కోరారు. అలాగే వీరఘట్టం -విశాఖపట్నం కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, వీరఘట్టంకు పాలకొండ, పార్వతీపురం ల నుండి నైట్ హాల్టు బస్సులను ఏర్పాటుచేయాలన్నారు. వీరఘట్టం మేజర్ పంచాయతీ ప్రజలకు అప్పలవలస సమీపంలో ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఇళ్లు కట్టేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని, ఇందువల్ల వీరఘట్టంకు సమీపంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అర్జీ ఇచ్చారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా మార్చాలని కోరుతూ అర్జీ ఇచ్చారు. జె.గోపాలపురం రహదారిని బాగు చేయాలని, కస్పా వీధి సమీపంలో ఉన్న ఒట్టి గెడ్డ కు రక్షణ గోడ నిర్మించాలని, ఆ వీధిలో తాగునీటి పరిష్కరించాలని కోరారు. తొలుత మండలానికి విచ్చేసిన కలెక్టరుకు ఎమ్మెల్యే కళావతి, ఎంపిపి డి.వెంకటరమణనాయుడు దుస్సాలువ, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి - కొమరాడ

ప్రతి గ్రామానికి రహదారి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయం కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. శుక్రవారం గిరిజన ప్రజలు దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న మాదిలింగి నుండి పూజారిగూడ రహదారికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంత ఆమె మాట్లాడుతూ ప్రజలకు కనీస అవసరాలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. దశాబ్ద కాలంగా కనీస రహదారికి నోచుకోని గ్రామాలకు కూడా రహదారి సదుపాయం కల్పించేలా ప్రభుత్వ నిధులు మంజూరు చేసిందని, ఈ మేరకు పనులు చేపడుతున్నట్టు తెలిపారు. గిరిజన ప్రజలకు రోడ్డు, తాగునీరు, విద్య, వైద్య వంటి సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసి రూపొందిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వాలు గిరిజన గ్రామాలకు కనీసం రోడ్డు సదుపాయాలు కల్పించే దుస్థితి లేకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాలను అభివృద్ధి చేసేలా చర్యలు చేపడుతుందని తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఇప్పటికే గిరిజన ప్రజలు సాగు చేస్తున్న భూములకు పట్టాలిచ్చి వారికి రైతు భరోసా వంటి పథకాలు కూడా అందజేసిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి శ్యామల, జెడ్‌పిటిసి ద్వారపురెడ్డి లక్ష్మి, మాదలింగి సర్పంచ్ తుమరాడ కళావతి, వైసిపి మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన్ రావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ శెట్టి మధుసూదనరావు, మండల సచివాలయ కన్వీనర్ యేగిరెడ్డి సింహాచలం, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

పాఠశాలకు రహదారి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి కొమరాడ

ఉలిపిరి సమీపాన ఉన్న పాఠశాలకు ప్రతి రోజూ 320 మంది గిరిజన విద్యార్థులకు 30 ఏళ్ల అయినా కనీసం సరైన రోడ్డు సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం విఫలమయ్యారని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి విమర్శించారు. శుక్రవారం ఆయన ఉలిపిరి రోడ్డు పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఉలిపిరి సమీపంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఉంది. ఈ పాఠశాల ప్రారంభించి నేటికి 30 ఏళ్లు అయినా పూర్తిస్థాయిలో రహదారి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పాఠశాలకు నిత్యవసర వస్తువులు తీసుకురావాలన్నా, అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనం వెళ్లాలన్నా అవస్థలు పడాల్సిందే. ఈ సమస్యపై పలుమార్లు వినతులు అందజేసినా స్పందించిన పరిస్థితుల్లేవన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

టిడిపిలో 47 కుటుంబాలు చేరిక

సీతంపేట : మండలంలోని కిరప పంచాయతీ పెద్దగూడకు వార్డు సభ్యులు సవర మోహన్‌రావు, సవర కూర్మారావుతో సహా 47 కుటుంబాలు శుక్రవారం పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ అవినీతి, అరాచక విధానాలతో వైసిపి పతనం మొదలైందని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, మండల టిడిపి అధ్యక్షులు సవర తోట మొఖలింగం, బిసీ సెల్ అధ్యక్షులు ఆర్ రంగనాథం, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీలు ఎన్నిక

ప్రజాశక్తి - సాలూరు

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా పట్టణంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో సాలూరు, పాచిపెంట మండలాలకు నూతన కార్యవర్గాల ఎన్నిక జరిగింది. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.విజయకుమార్ ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. సాలూరు మండల కమిటీ అధ్యక్షులుగా అంబటి సీతయ్య, గౌరవాధ్యక్షులుగా సింగారపు సింహాచలం, సహాధ్యక్షులుగా యు.తిరుపతి, సిహెచ్.లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా అనకాపల్లి గణేష్, కోశాధికారిగా ఎస్.కృష్ణ ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిల్ సభ్యులుగా కోలా ఆనంద్, ఎవి రామారావు, ఎ.మన్మధ రావు, సిహెచ్.జగదీష్, అన్సారీ బేగం, కె.లీల, ఎం.ఈశ్వరరావు ఎన్నికయ్యారు. పాచిపెంట మండల అధ్యక్షుడిగా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా గణపతి ఎన్నికయ్యారు. **కురుపాం :** యుటిఎఫ్ కురుపాం మండల శాఖను జిల్లా అధ్యక్షులు తోట రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికకు జిల్లా కార్యదర్శులు బి.కూర్మారావు ఎన్నికల అధికారిగా, ఎన్ శ్రీరాములు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. గౌరవ అధ్యక్షులుగా ఎస్.సీతారాం, అధ్యక్షులుగా బి.కరువులు, సహాధ్యక్షులుగా కె.రవి, మహిళా సహాధ్యక్షులుగా బి.ఉమామహేశ్వరి, ప్రధానకార్యదర్శిగా ఎం.చలపతిరావు, కోశాధికారిగా యు.వెంకటరమణతో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముందుగా అజెండాలో పొందుపర్చిన 11 అంశాలను మున్సిపల్ ఉద్యోగి సురేష్ చదివి వినిపించారు. అంశాలలో పలు వార్డులకు సంబంధించి 9 అభివృద్ధి పనులను, రెండు రెవెన్యూ విభాగాల అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. జీరో అవర్‌లో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇండుపూరు గున్నేష్ మాట్లాడుతూ పాలకవర్గం ఏర్పడిన ఈ రెండున్నర ఏళ్లలో తమ వార్డుకు రూ.3 లక్షల 85వేలు అభివృద్ధి పనులను మంజూరు చేయడం గొప్ప శుభ పరిణామమని, ఈ అజెండా కాపీని లామినేషన్ చేసుకుని భద్రపరచుకుంటానని మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలపడంతో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఆ సందర్భంలో ఆశ్చర్యానికి గురవ్వడం విశేషం. 14వ వార్డు టిడిపి కౌన్సిలర్ ద్వారపురెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ పలు వార్డుల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అలాగే పట్టణ శివారులో ఉన్న డంపింగ్ యార్డ్‌లో వ్యర్థాలు ప్రధాన రహదారిపైకి రావడంతో వాహదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఫిర్యాదు చేశారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ డంపింగ్ యార్డ్ లోపల సిసి రోడ్డు నిర్మాణం జరుగుతుందని, పనులు పూర్తయిన వెంటనే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. సమావేశంలో వైస్‌చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇండుపూరు గున్నేష్, పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ రెవెన్యూ అధికారి దిబ్బ రూబెన్, టిపిఒ పి.కనకారావు, డిఇ పి.కిరణ్ కుమార్, ఎఇ జి.ఆనంద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ ఇండుపూరు గున్నేష్

జెఎఎస్‌తో మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని బందలుప్పి పిహెచ్‌సి పరిధిలో వెంకంపేటలో శుక్రవారం నిర్వహించిన జెఎఎస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల వైద్య సేవలు ప్రజలకు అందించి ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తుందని, అవసరమైతే మెరుగైన వైద్య సేవల కోసం నాణ్యమైన ఆసుపత్రులకు రిఫరల్ సౌకర్యం కూడా ఉందని అన్నారు. కనుక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్స్ చూశారు. కార్యక్రమంలో తహశీల్దార్ శివన్నారాయణ, వైద్యాధికారులు డాక్టర్ భాస్కరరావు, సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, మాధవ, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపిలు సిద్దా జగన్నాథరావు, బంకురు రవికుమార్, నాయకులు బొమ్మి రమేష్, భీమవరపు కృష్ణమూర్తి, మడక విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలోని కేసలి సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల పాల్గొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్తరపు నిర్మల, వైస్ ఎంపిపి కె.రవీంద్రనాథ్, టి.గౌరీశ్వరరావు, సింహాచలం, మర్రి ఉమ, ఎంపిటిసి సభ్యులు గౌరమ్మ, మీసాల మోహన్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని నార్లవలసలో ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి ఆధ్వర్యంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని తమ సొంత గ్రామంలో ఈ కార్యక్రమాలు చేస్తుందని, వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రామన్న దొర, ఎంపిటిసి అనూష, వైద్యులు శివకుమార్, సచివాలయం, అంగన్వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ : మండలంలోని గోపాలపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు తనిఖీ చేశారు. ప్రతి కౌంటర్ వద్ద ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఇంటింటి ఆరోగ్య సర్వేలో ఎంతమందికి టోకెన్లు అందజేశారని, శిబిరం వద్ద కొత్తగా ఎంత మందిని నమోదు చేశారని వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఒపి నమోదు వివరాలు రికార్డులో పరిశీలించారు. పలు ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారిని ఆయా రోగాల వారీగా ఎంతమంది వైద్య సేవలు వినియోగించుకుంటున్నారని అడిగారు. అనంతరం అంగన్వాడీ స్టాల్‌ను పరిశీలించి ఎంతమంది గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. స్టాల్‌లో ఏర్పాటు చేసిన ప్రతి పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు కె.వెన్నెల, ఎం.చిరంజీవి, స్పెషలిస్ట్ వైద్యులు, సర్పంచ్ ఎస్.జగదీష్, సిహెచ్‌ఒ రాజేశ్వరి,పంచాయతీ సెక్రటరీ వి.సీతారాం, వైద్య, సచివాలయం, అంగన్వాడీ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని బూరుజోలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి తోట శాంతికుమారి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో నిపుణులైన వైద్యులచే పేదలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తున్నామని, కావున ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బత్తిలి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కొండపల్లి రవీంద్ర, డాక్టర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో జరిగిన వైద్యశిబిరంలో 407 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మెరుగైన వైద్యం కోసం 14 మందిని రెఫర్ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం, వైద్యులు సోయల్, సర్పంచ్ మడపానా కేశవ, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, పసుకుడి సర్పంచ్ బెవర భార్గవనాయుడు, డిప్యూటీ తహశీల్దార్ శేఖరం, వైసిపి నాయకులు నిమ్మల త్రినాధరావు, పత్తిక సింహాచలం, నీలాద్రి, శ్రవణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మక్కువ: మండలంలోని కవిరిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసనాయుడు వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మావుడి రంగునాయుడు, ఎంపిడిఒ సూర్యనారాయణ, డాక్టర్ రఘు కుమార్, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, వైద్య సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



సాలూరు : వైద్యశిబిరంలో మందులను పరిశీలిస్తున్న వైస్ ఎంపిపి సురేష్

పలుచోట్ల 'బాబుతో నేను'

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పట్టణంతో పాటు మండలంలో టిడిపి ఆధ్వర్యంలో బాబు తోనే నేను కార్యక్రమం విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో పట్టణంలోని 15, 18 వార్డులతో పాటు పార్వతీపురం మండలం డోకిశిల, డికె పట్నం, బుదురువాడ పంచాయతీల్లో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ , మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు తో కలసి ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ చంద్రబాబుపై వైయస్ జగన్మోహన్ రెడ్డి సాగిస్తున్న కక్షపూరిత చర్యలు గురించి వివరిస్తూ వారి మద్దతు కూడగట్టారు. కార్యక్రమంలో నాయకులు ద్వారపురెడ్డి శ్రీదేవి, గొట్టాపు వెంకటనాయుడు, బార్నాల సీతారాం, బోను చంద్రమౌళి చంటి, కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, బడే గౌరీ నాయుడు, తాతపూడి వెంకటరావు, కోలా సరిత మధు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఎగువ తాడికొండలో బాబు నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పాడి సుదర్శనరావు, ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, కురుపాం నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, గుమ్మలక్ష్మీపురం మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు తోయక కామేష్, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు జయంత్, మాజీ సర్పంచ్ రామస్వామి, యూత్ ప్రెసిడెంట్ శివ, పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



పార్వతీపురం : కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

కుందర తిరువాడలో...

జియమ్మవలస మండలం కుందర తిరువాడ పంచాయితీ, నీచుకువలసలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ గురించి ఇంటింటికి వెళ్లి వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పల్ల రాంబాబు, అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎస్టీ సెల్ అరుకు పార్లమెంటు అధికార ప్రతినిధి నందివాడ కష్ణబాబు, మాజీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు ఎన్నాళ్లు సాగవని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని కందులపదంలో బాబునేను కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబుపై జరుగుతున్న కక్ష సాధింపు, అక్రమ కేసులు గురుంచి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఆమదాల పరమేశ్, బుస తవుడు, తాడుతూరి తిరుపతిరావు, అక్యన తిరుపతిరావు, శ్యామ్, నాగరాజు, మచ్చయ్య, మాలతిదొర, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన

ప్రజాశక్తి - కొమరాడ

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అభివద్ధి చేసేందుకు ప్రభుత్వాలు అన్ని విధాల చర్యలు చేపడుతున్నట్లు డిఆర్‌డిఎ ఎపిడి వై.సత్యంనాయుడు అన్నారు. శుక్రవారం వైఎస్ఆర్ క్రాంతి పథకం కార్యాలయంలో మండలంలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరిశ్రమల శాఖ ఐపిఒ మూర్తి పాల్గొన్నారు. ఈ అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామిక అవగాహన, జాతీయ లైవ్ స్టాప్ మిషన్ గురించి సదస్సుకు హాజరైన లబ్ధిదారులకు వివరంగా పలు అంశాలు తెలియజేశారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాంకు అర్హతలు 18-50 ఏళ్లలోపు ఉండాలన్నారు. కార్యక్రమానికి అర్హులు కనీసం 8వ తరగతి పాస్ అయ్యి ఉండాలన్నారు. ప్రోగ్రాంలో అర్హులైన వారికి బ్యాంకులు నుండి రుణాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు 35 శాతం, మగవారికి 30 శాతం సబ్సిడీ రుణం సక్రమంగా చెల్లిస్తే, ఆ తర్వాత బ్యాంకు నుండి సబ్సిడీ వస్తుందని తెలిపారు. లబ్ధిదారులు ఈ స్కీములను ఉపయోగించుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఎడి బి.చక్రధర్, డిపిఎం ఫైనాన్స్, ఎపిఎం వెంకటరమణ, సిసిలు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధ కళాకారుడికి సన్మానం

ప్రజాశక్తి- బలిజిపేట

మండలంలోని తుమరాడలో స్థానిక ఎంపిపి పాఠశాలలో శుక్రవారం వృద్ధ కళాకారుడు జాకరపల్లి ఈశ్వరరావును ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ముందుగా దుశ్శాలువాతో సన్మానించి పుష్ప గుచ్ఛాలు అందించారు. అనంతరం ఆయన గురించి ప్రధానోపాధ్యాయులు వివరించారు. వృద్ధ వయస్సులో తనదైన శైలిలో దేశభక్తి గీతాలు ఆలపించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని, విద్యార్థులు ఆయన్ను ఆదర్శంగా తీసుకొని దేశభక్తి గీతాలపై శ్రద్ధ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.వెంకట్రావు, ఉపాధ్యాయులు సత్యారావు, నరసయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



బయో ఇన్‌పుట్‌సెంటర్‌ను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం పరిశీలన

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని బర్లి, మిర్తివలసలో ఎపి సిఎన్ఎఫ్ డిపిఎం షణ్ముఖరాజు, మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రావణ్ కుమార్ ప్రకృతి వ్యవసాయ క్షేత్ర పరిశీలన శుక్రవారం చేశారు. ఈ సందర్భంగా వారు ప్రకృతి వ్యవసాయ రైతులైన తాన్న రామకృష్ణ, డాక్టర్ శంబంగి శ్రీనివాసరావు సాగు వివరాలను అడిగి తెలుసుకొని మరింత మెరుగైన దిగుబడుల కోసం సూచనలు, సలహాలు ఇచ్చారు. పరిశీలనలో భాగంగా మిర్తివలసలో గల బయో ఇన్పుట్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సెంటర్లో గల 4000 లీటర్ల జీవామృతం, 500 లీటర్ల దశపర్ణిక, 200 లీటర్ల అగ్నాస్త్రం, 100 లీటర్ల బ్రహ్మాస్త్రం,100 లీటర్ల పంచగవ్య, 500 లీటర్ల పుల్లటి మజ్జిగ, 50 లీటర్ల మీనామృతం, 30 లీటర్ల ఎగ్ అమినో యాసిడ్, ఎల్లో ప్లేట్లు, పెరమోన్ ట్రాపర్స్, నవధాన్యాలు, కాయగూర విత్తనాలను పరిశీలించి ప్రకృతి వ్యవసాయ రైతులు ఈ బయో ఇన్పుట్ సేవలను వినియోగించు కోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ద్రావణాలు, కషాయాల వాడకం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందని, దీంతో పాటు ప్రజల ఆరోగ్యం బాగుపడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు శ్రీరాములు, నరసింహ, సిఆర్‌పిలు లక్ష్మి, తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.